
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
బుధవారం 3 ఏప్రిల్ 2024



సాగునీరందక ఎండిపోతున్న పంటలను కాపాడాలి

8లో..

ఓసీపీ-2 విస్తరణ పనులకు రంగం సిద్ధం





బీసీ, మైనార్టీ కార్పొరేషన్లు గాడిన పడేనా?

- ప్రతి ఏటా రుణ ప్రణాళికలకు దిక్కు లేదు
- ఎన్నికలు వస్తేనే గుర్తుకు వచ్చే అంశం
- కొత్త ప్రభుత్వంపై ఆశలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

నిధులు లేక బీసీ, మైనార్టీ కార్పొరేషన్లు నిర్వీర్యం అవుతున్నాయి. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు, స్వయం ఉపాధి పథకాల ద్వారా సబ్సిడీ అందించేందుకు వీటిని ఏర్పాటు చేశారు. గతంలో ఎన్నికలు వచ్చినప్పుడే ప్రభుత్వానికి ఇవి గుర్తుకు వచ్చాయి. ఆఘమేఘాల మీద కొన్ని పథకాలను ప్రకటించి తక్కువ వ్యవధిలోనే దరఖాస్తులను ఆహ్వానించి కొంత మంది లబ్ధిదారులకు మాత్రమే ప్రయోజనం చేకూర్చారు. వాటిని ఏ లక్ష్యం కోసమైతే ఏర్పాటు చేశారో ఆ లక్ష్యాలను మరిచిపోవడం నిరుద్యోగులకు శాపంగా మారింది. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న కార్పొరేషన్లకు తోడు మరిన్ని కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయడంతో సబ్సిడీ పథకాలపై ఆశలు పెంచుకున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న రజక, నాయీబ్రాహ్మణ, శాలివాహన(కుమ్మరి), విశ్వబ్రాహ్మణ, మేదరి, వడ్డెర, సగర(ఉప్పర), క్రిష్ణ బలిజ (పూసల), వాల్మీకి(బోయ), భట్రాజు, గౌడ సమాఖ్యలు ఉన్నాయి. వీటి ద్వారా వ్యక్తిగతంగా, గ్రూపుల వారీగా వృత్తిపరంగా ఆర్థికంగా మరింత ఎదిగేందుకు ప్రతి ఏటా సబ్సిడీ రుణాలు ఇవ్వాల్సి ఉండగా నిర్లక్ష్యం ప్రదర్శించారు. ప్రతి ఏటా రుణ ప్రణాళికను రూపొందించాల్సి ఉండగా గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. అసలు బీసీ కార్పొరేషన్ ఉందా, లేదా అనే అనుమానాలు వ్యక్తం అయ్యాయి. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన నాటి నుంచి ఇప్పటివరకు రెండుసార్లు మాత్రమే బీసీ కార్పొరేషన్ ద్వారా పలు పథకాలను ప్రకటించింది. 50 శాతం నుంచి మొదలుకుని వంద శాతం సబ్సిడీ వరకు ఇచ్చే రుణాలను అమలుచేయలేదు. 2015-16 ఆర్థిక సంవత్సరంలో బీసీ కార్పొరేషన్ ద్వారా పెద్దఎత్తున స్వయం ఉపాధి పథకాలను అమలుచేసింది. వీటి ద్వారా అనేక మంది బీసీలకు లబ్ధి చేకూరింది. ఆయా బీసీ కులాల కార్పొరేషన్ల ద్వారా కుల సంఘాలకు నిధులు మంజూరు చేసింది. ఎంపిక చేసిన గ్రూపులన్నింటికీ నిధులు విడుదల చేయడంలో తీవ్రంగా జాప్యం జరిగింది. జిల్లాల పునర్విభజన జరిగిన తర్వాత పెండింగులో ఉన్న యూనిట్లకు సబ్సిడీ సొమ్మును విడుదల చేసింది. 2018లో ముందస్తు అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లిన అదే ఏడాది బీసీ కార్పొరేషన్ ద్వారా ఒక లక్ష, రూ. 50 వేల రూపాయల విలువైన యూనిట్లను నెలకొల్పేందుకు గాను నిర్ణయించి దరఖాస్తులను స్వీకరించింది. దీంతో అనేక మంది దరఖాస్తు చేసుకున్నారు. కానీ కేవలం 1479 మంది లబ్ధిదారులకు మాత్రమే 50 వేల రూపాయల చొప్పున మంజూరు చేసింది. ఇంతలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యింది. రెండవసారి కూడా బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. నాలుగేళ్ల తర్వాత మళ్లీ ఎన్నికలు ముంచుకు రావడంతో చేతి వృత్తులు చేసుకునే నాయీబ్రాహ్మణ, రజక, సగర, ఉప్పర, కుమ్మరి, అవుసుల, కంసాలి, కమ్మరి, కంచరి, వడ్రంగి, కృష్ణ బలిజ, పూసల, మేదరి, వడ్డెర, ఆరెకటిక, మేర 15 కులాలకు చెందిన వారికి లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేస్తామని గత ఏడాది జూన్‌లో ప్రకటించింది. ఆ మేరకు 10,759 మంది దరఖాస్తు చేసుకోగా, అందులో 9,100 మంది అర్హులుగా గుర్తించారు. 962 మంది లబ్ధిదారులకు మాత్రం 9 కోట్ల 62 లక్షల రూపాయలు వారి ఖాతాల్లో జమచేసింది. ఆ తర్వాత ఎన్నికల షెడ్యూల్ రావడంతో ఆ పథకం మూలకు పడింది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న 11కార్పొరేషన్లకు తోడు మరిన్ని కార్పొరేషన్లను ఏర్పాటు చేసింది. వాటి ద్వారా ఇంకా ఎలాంటి పథకాలు ప్రకటించ లేదు. కనీసం ఈ ప్రభుత్వమైనా తమ గురించి పట్టించుకోవాలని బీసీలు కోరుతున్నారు.

● మైనార్టీ కార్పొరేషన్‌దీ అదే పరిస్థితి..

మైనార్టీ కార్పొరేషన్ పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లుగా కొనసాగుతున్నది. దీనిని కూడా ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ కార్పొరేషన్‌ను ప్రభుత్వం మైనార్టీ సంక్షేమ శాఖలోనే విలీనం చేశారు. 2015-16 నుంచి చదువుతో పని లేకుండా నిరుద్యోగులుగా ఉన్న వారికి కూడా సబ్సిడీ రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 91 యూనిట్లను నెలకొల్పాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఆ మేరకు యూనిట్లను మంజూరు చేసింది. ఎంపికైన లబ్ధిదారులకు 88 లక్షల 80 వేల రూపాయల సబ్సిడీ సొమ్మును విడుదల చేయాల్సి ఉండగా కొందరికి మాత్రమే సబ్సిడీ విడుదల చేసింది. 2017-18 ఆర్థిక సంవత్సరానికి 135 యూనిట్లు లక్ష్యంగా నిర్ణయించారు. ఆ మేరకు దరఖాస్తులను ఆహ్వానించడంతో చాలా మంది దరఖాస్తు చేసుకున్నారు. 2018-19లో 11 యూనిట్లు మాత్రమే మంజూరు చేసి గ్రౌండింగ్ చేశారు. 2015-16 నుంచి 2018-19 వరకు ఎంపికైన లబ్ధిదారుల్లో పలువురికి నేటికి కూడా సబ్సిడీ రాలేదు. దీంతో వాళ్లు కార్యాలయం చుట్టూ తిరిగి వేసారిపోయారు. నాలుగు మాసాల క్రితం 54 యూనిట్ల కోసం దరఖాస్తులను ఆహ్వానించారు. కానీ ఇంకా యూనిట్లు గ్రౌండింగ్ కాలేదు. ఎన్నికలకు ముందు మైనార్టీల కోసం లక్ష రూపాయల పథకాన్ని ప్రకటించగా, ఆన్‌లైన్ ద్వారా 3086 మంది దరఖాస్తు చేసుకోగా, 106 మంది లబ్ధిదారులకు మాత్రమే చెక్కులను జారీచేశారు. క్రిస్టియన్లు 200 మంది దరఖాస్తు చేసుకోగా, 45 మంది లబ్ధిదారులకు లక్ష చొప్పున మంజూరు చేసినప్పటికీ, నిధులు విడుదల చేయలేదు. ఇప్పట్కైనా కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం స్పందించి ప్రతి ఏటా ఆయా కార్పొరేషన్ల ద్వారా రుణ ప్రణాళికలు రూపొందించి సబ్సిడీ రుణాలను అందజేయాలని బీసీ, మైనార్టీలు కోరుతున్నారు.

క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలి

- సంక్షోభంలో చిక్కుకున్న రైతులను ఆదుకోవాలి

- కలెక్టర్‌కు బీఆర్ఎస్ నేతల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

పెద్దపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పండిన అన్ని పంటలకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ చెల్లించి కొనుగోలు చేయడంతో పాటు సంక్షోభంలో చిక్కుకున్న రైతాంగాన్ని ఆదుకోవాలని కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. పార్టీ పిలుపు మేరకు మంగళవారం పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా అంతటా రైతులు సాగునీరు లేక పంటలు ఎండిపోయి తీవ్ర దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారన్నారు. పంటలను కాపాడుకోవడానికి వేలాది రూపాయలు ఖర్చుచేసి, ఎన్నిబోర్లు వేసినా ప్రయోజనం లేదని, చెరువులను నింపకపోవడంతో, భూగర్భ జలాలు అడుగంటి పోయాయన్నారు. పొట్టకొచ్చిన పొలాలు పశువులకు మేతగా మారుతున్నయి. కళ్ల ముందే పంటలు ఎండిపోతుంటే రైతులు కన్నీరు మున్నీరు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటికి తోడు వేళాపాళాలేని కరెంట్ కోతలు కూడా రైతులను ఆగం చేస్తున్నాయన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 200కు పైగా రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. రైతుబంధు సాయం ఇంతవరకు కూడా అందరు రైతులకు అందలేదన్నారు. ఎరువులు, విత్తనాల కోసం అన్నదాతలు మిత్తీలకు అప్పులు చేయాల్సి వచ్చిందన్నారు. ఈ ఏడాది వర్షాలు కురిసి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు ఉన్నప్పటికీ, నీటి నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగానే రైతులకు సాగు నీరందలేదన్నారు. ఇది ప్రకృతి కారణంగా వచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువు విమర్శించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ప్రతి పంటకు క్వింటాలుకు రూ.500బోనస్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓదెల జడ్పీటీసీ గంట రాములుయాదవ్, ఎంపీపీ నూనెటి సంపత్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, నాయకు లు బండారి శ్రీనివాస్, మర్కు లక్ష్మన్, దాసరి ఉష, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో ధాన్యం కొనుగోలు చేయాలి

- అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌లాల్

మంథని, ఏప్రిల్ 2: జిల్లాలో రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరపై సకాలంలో కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంథని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాసంగి సిజన్‌కు సంబంధించి మద్దతు ధర ప్రకారం ధాన్యం కొనుగోలు జరిగిందన్నారు. రైతులు తమ పంటకు మద్దతు ధర సాధించడానికి నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ధాన్యాన్ని బాగా ఆరబెట్టి చెత్త, తాలు, మట్టి పెడలు, రాళ్లు లేకుండా శుభ్రపరచాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ కొనుగోలు కేంద్రాలకు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పంట తీసుకొని రావాలని కోరారు. ధాన్యం విక్రయించే సమయంలో రైతులు తమ ఫోన్ నంబర్‌ను ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతాకు లింక్ చేసి తీసుకుని రావాలని, ధాన్యం విక్రయించే సమయంలో ఓటీపీ కోసం సెల్ ఫోన్ తీసుకుని రావాలని, ఆధార్ కార్డు, పట్టాదార్ పాస్ పుస్తకం బ్యాంక్ ఖాతా పుస్తకం తమ వెంట తీసుకుని రావాలని సూచించారు. కొనుగోలు కేంద్రంలో అవసరమైన మౌలిక వసతులను సరి చూసుకొని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు నిమిత్తం అవసరమైన వాహనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకొని, సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి సంబంధిత మిల్లర్లకు కేటాయించాలని, రైస్ మిల్లు వద్ద ఎట్టి పరిస్థితుల్లో ధాన్యం కోత కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అనంతరం ఎంఎస్ఎస్ పాయింట్‌ను సందర్శించి, రేషన్ షాపులకు పంపిణీ చేయాల్సిన రైస్ నిలువలు, వాటి రికార్డులను ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాలని, గోదాం నిర్వహణకు సంబంధించి మరమ్మత్తులు, జాగ్రత్తలు ఏమైనా ఉంటే వెంటనే పూర్తి చేసుకోవాలని సందర్శించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లైస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ ఎమ్.శ్రీకాంత్, జిల్లా సహకార అధికారి శ్రీమాల, వ్యవసాయ, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 2: గోదావరిఖని తిలక్‌నగర్‌లోని సుఫీ ఇస్లామిక్ బోర్డు అధ్యక్షురాలు మహ్మద్ షిరీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసిందని, పార్లమెంట్ ఎన్నికల తరువాత ఇందిరమ్మ ఇండ్లను కూడా ఇస్తామని చెప్పారు. ఆరు గ్యారంటీలలో ఐదు గ్యారంటీలు విజయవంతంగా అమలవుతున్నాయన్నారు. ముస్లింలకు 12శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొంతల రాజేష్, కౌటం సతీష్, మహిళలు పాల్గొన్నారు.

మల్లికార్జున ఖర్గే, రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మల దహనం



దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 2: తెలంగాణ రాష్ట్రంలో ఎంపీ పార్లమెంట్ స్థానాల్లో ఒక్క సీటు కూడా మాదిగలకు కేటాయించకుండా కాంగ్రెస్ పార్టీ వివక్ష చూపుతోందని ఆరోపిస్తూ ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం గోదావరిఖని ప్రధానచౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జీ కల్వల శరత్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మాలల చేతుల్లో బంది అయ్యాడని, మాలలను ఎత్తుకొని మాదిగలను అణచివేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంతెన సామిల్, మంథని చందు, ఎం.దశరథం, బచ్చల రజనీకాంత్, పొట్ల రమేష్, రాజయ్య, నరేస్, మంథెన చిరంజీవి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో మరోసారి అక్రమ నిర్మాణాల తొలగింపు



మేడిపల్లి సెంటరులో అక్రమ నిర్మాణాల తొలగింపు

జ్యోతినగర్, ఏప్రిల్ 2 : ఎన్టీపీసీ మేడిపల్లి సెంటరు పరిధిలోని గ్రీన్‌బెల్ట్‌లో ఉన్న అక్రమ నిర్మాణాలను మంగళవారం కార్పొరేషన్ సిబ్బంది తొలగించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ పర్యవేక్షణలో గ్రీన్‌బెల్ట్ సర్వీస్ రోడ్డులో ఉన్న దుకాణాలు, టేలాలను తొలగించారు. గతంలో గ్రీన్ బెల్ట్ పరిధిలో ఉన్న అక్రమ కట్టడాలను రెండుసార్లు తొలగించగా, మిగిలిన మరికొన్ని నిర్మాణాలను మంగళవారం తొలగించారు. తొలగింపు ప్రక్రియను మేయర్ డాక్టర్ అనిల్ కుమార్ పరిశీలించారు. కాగా, తొలగింపునకు గురైన చిరు వ్యాపారులకు ఎన్టీపీసీ వీక్లీ మార్కెట్ ముందు ఉన్న స్థలం మున్సిపల్ అధికారులు చూపించారు.

కాంగ్రెస్ పాలనలో రైతులకు మిగిలింది కన్నీళ్లే..

- ఎండిన పంటలకు నష్టపరిహారం అందించాలి - మాజీ మంత్రి, పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఈశ్వర్

మంథని, ఏప్రిల్ 2: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులకు కన్నీరు మిగిల్చిందని మాజీ మంత్రి, పెద్దపలి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. మంథని-గోదావరిఖని ప్రధాన రహదారి వెంట పోచమ్మవాడ సమీపంలోని ఎండిన వరి పంటలను జిల్లా పరిషత్ ఛైర్మన్ పుట్ట మధుతో కలిసి మంగళవారం కొప్పుల ఈశ్వర్ పరిశీలించారు. పంటలు ఎండిపోయిన రైతులకు భరోసా కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు నీళ్లు ఇస్తామని హామీ ఇవ్వడంతోనే రైతులు వరి పంటలను సాగు చేశారన్నారు. రైతులు నీళ్లు రాక అరిగోస పడుతున్నారన్నారు. నీళ్లు లేక, కరెంట్ రాక పంటలు ఎండిపోయి నష్టపోతున్న రైతులకు భరోసా కల్పించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం గత పాలకుల కారణంగానే నీళ్లు రావడం లేదంటూ విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఒక ఎకరం భూమికి కూడా నీళ్లు ఇవ్వకుండా లేరన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి ఎకరానికి రూ.25 ఎకరాల నష్ట పరిహారం చెల్లించడతో పాటు రూ.500ల బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.



ఎండిన పంటలను పరిశీలిస్తున్న కొప్పుల ఈశ్వర్, పుట్ట మధు



ఎంపీడీవో కార్యాలయంలోని మరుగుదొడ్లు

అధ్వానంగా మరుగుదొడ్లు.. తప్పని ఇక్కట్లు..

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 2 : పెద్దపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మరుగుదొడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఎవరూ పట్టించుకోకపోవడంతో అపరిశుభ్రంగా మారాయి. సమస్యల పరిష్కారం కోసం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చే వారు మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయంలో సమావేశాలు జరిగిన సందర్భంలో అధికారులు, ప్రజాప్రతినిధులు మూత్రశాలల సరిగా లేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పట్కైనా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించిన సీపీ

కోల్‌సిటీ, ఏప్రిల్ 2: సైబర్ నేరస్థుల చేతిలో మోసపోయిన బాధితులను ఆదుకునేందుకు, వారు నేరుగా ఫిర్యాదు చేసేలా రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ప్రత్యేకంగా సైబర్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. మంగళవారం కమిషనర్ ఎం శ్రీనివాస్ ఈ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు, బాధితులకు సత్వర సేవలు అందించేందుకు ప్రత్యేకంగా సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్నామన్నారు. ఈ పోలీస్ స్టేషన్‌కు పర్యవేక్షణాధికారిగా ఏసీపీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, ఒక హెడ్ కానిస్టేబుల్, ఏడుగురు కానిస్టేబుళ్లు ఉంటారన్నారు. ఈ బృందం సైబర్ బాధితులకు సత్వర న్యాయం అందించడం, కేసులు నమోదు చేయడం, నేరస్థులను అరెస్టు చేయడం వంటి విధులు నిర్వహిస్తారన్నారు. లక్షకు పైగా సైబర్ క్రైమ్ మోసాలకు ఈ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చునని, నేరుగా ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారన్నారు. మిగతా కేసులు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ మోసాలకు గురైన వారు 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సీ రాజు, సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటరమణ, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, ఎస్‌బీ, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ప్రారంభిస్తున్న సీపీ శ్రీనివాస్

కానిస్టేబుల్ కుటుంబానికి భద్రత చెక్కు అందజేత

ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేసి అనారోగ్యంతో మరణించిన టీ మధు కుటుంబానికి భద్రత ఎక్స్‌గ్రేషియా కింద రూ.8లక్షల చెక్కును బుధవారం సీపీ శ్రీనివాస్ అందజేశారు. మధు భార్య లత, కుమారుడు సాయి చరణ్‌లకు ఈ చెక్కును అందజేశారు. అడిషనల్ డీసీపీ రాజు, ఏఆర్ ఏసీపీ సురేంద్ర, ఏఓ అశోక్‌కుమార్, ఆర్ఐ దామోదర్, ఆర్ఐ హోంగార్డు మల్లేషం పాల్గొన్నారు.

ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

- జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వ్యవసాయాధికారులు, రైతులు

కమాన్‌పూర్, ఏప్రిల్ 2 : రైతులు తగిన మోతాదులో ఎరువులను వాడాలని, అధిక మొత్తంలో ఎరువుల వాడకం తగ్గించాలని జిల్లా వ్యవసాయాధికారి దోమ ఆదిరెడ్డి అన్నారు. గుండారం గ్రామంలోని రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సమగ్ర వ్యవసాయం-శిక్షణ కార్యక్రమం, వేసవి కాలంలో దోసకాయ పంట సాగు వివరాలపై అవగాహన సదస్సు జరిగింది. నేలలో కార్బన్ శాతం ప్రతి సంవత్సరం తగ్గుతూ వస్తుందని, పంట వ్యర్థాలు కాల్చివేత అని, ఈ పనిని సాధ్యమైనంత వరకు రైతులు తగ్గించుకొని పంట వ్యర్థాలను భూమిలో కలియదన్నేలాగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయాధికారి బండి ప్రమోద్‌కుమార్, రామగిరి వ్యవసాయాధికారి భూక్య మోహన్, రైతులు పాల్గొన్నారు.

నగదు పట్టివేత

వేములవాడ రూరల్, ఏప్రిల్ 2: వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో లక్ష రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై మారుతి తెలిపారు. వట్టెంల గ్రామం వద్ద మంగళవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా వేములవాడకు చెందిన రాజశేఖర్ అనే వ్యక్తి సరైన ఆధారాలు లేకుండా లక్ష రూపాయలు ఉండడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

● తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులోని చెక్‌పోస్టు వద్ద 93,500నగదును మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు ఏఈ సుమన్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఆర్ఎస్ఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

కేడీసీసీబీకి రూ.100 కోట్ల లాభం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 2: కరీంనగర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (కేడీసీసీబీ) 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.100.10 కోట్ల స్థూల లాభాన్ని ఆర్జించి గత ఏడాది రికార్డును బ్రేక్ చేసిందని బ్యాంకు ముఖ్య కార్య నిర్వహణ అధికారి ఎన్.సత్యనారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 91.40 కోట్ల స్థూల లాభం నమోదు కాగా ఈ యేడాది రూ.8.70 కోట్లు అదనంగా లాభం ఆర్జించడం జరిగిందని అన్నారు. బ్యాంకు నిర్ధరక ఆస్తులు గత ఏడాది 0.97శాతం నుంచి ఈయేడు 0.75శాతానికి తగ్గిందని, 0.22శాతం తగ్గింపు గొప్ప విజయమని, ఇది బ్యాంకు పాలకవర్గం, ఉద్యోగులు, సిబ్బంది సమష్టి కృషితోనే సాధ్యమైందని చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అభినందించారు. డిపాజిట్లలో కూడా 246.28 కోట్ల వృద్ధితో గత ఏడాది ఉన్న 2282.62 కోట్ల నుంచి 2528.90 కోట్లకు పెరిగాయని అన్నారు. అడ్వాన్సులు కూడా 18.85శాతం వృద్ధితో రూ.3973.34 కోట్లకు పెరిగాయని, బ్యాంకు మొత్తం వ్యాపారం రూ.876.24 కోట్లకు పెరిగిందని అన్నారు. మొత్తం వ్యాపారం 6501.24 కోట్లుగా నమోదైందని పేర్కొన్నారు. జిల్లాలో ఎస్‌బీఐ, యూబీఐ తర్వాత మూడో అగ్రగామి బ్యాంకుగా కేడీసీసీబీ నిలవడం గర్వకారణమని, ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రూ.7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 2: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,550 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 42మంది రైతులు 614క్వింటాళ్ల విడి పత్తి, ఇద్దరు రైతులు నాలుగు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా కనిష్ఠ ధర రూ.6,200 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



బోనంతో బారులు తీరిన భక్తులు

వేములవాడ, ఏప్రిల్ 2: శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ బద్ది పోచమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. సోమవారం తమ ఇష్టదైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు మంగళవారం బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే భక్తిశ్రద్ధలతో నైవేద్యం వండి బోనం తయారుచేసి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొని బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భారీ సంఖ్యలో జనం తరలిరావడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి.

అదనపు కట్నం కోసం వేధింపులు

- కొడుకుకి విషగుళికలు తినిపించి మహిళ ఆత్మహత్య
- కూతురు, మనుమడి మరణాన్ని జీర్ణించుకోలేక ఆమె తల్లి బలవన్మరణం
- ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి



రేయాన్స్ (ఫైల్)



గాదె శ్రీజ(ఫైల్)



జయప్రద(ఫైల్)

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 2: వరకట్న వేధింపులతో అత్తింటివారు కొట్టి పుట్టింటికి పంపించగా, ఈ గొడవలను భరించలేక తల్లిగారింటికి వచ్చిన ఓ గృహిణి పేగు తెంచుకొని పుట్టిన ఏడాది కూడా నిండని 11 నెలల కొడుకుకు విషగుళికలు ఇచ్చి అవే విషగుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడింది. కూతురు, మనుమడి బలవన్మరణాన్ని చూసి తట్టుకోలేని తల్లికూడా అవే విషగుళికలు వేసుకొని తనువు చాలించిన విషాద ఘటన కరీంనగర్ జిల్లా బొమ్మకల్ గ్రామపంచాయతీలోని విజయనగర్ కాలనీలో కలకలం రేపింది. 24 గంటల వ్యవధిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. పోలీసులు, కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి.

కరీంనగర్ శివారులోని బొమ్మకల్ గ్రామపంచాయతీ పరిధిలోని విజయనగర్ కాలనీకి చెందిన పూసల జయప్రద, వెంకటేశ్వరచారిలు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వారికి ఇద్దరు కూతుళ్లు. చిన్న కూతురు గద్దె శ్రీజ(27)కు వరంగల్‌కు చెందిన మొద్దుంపూర్ నరేష్‌తో 2021 నవంబరు 27న వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.3 లక్షల వరకట్నంతో పాటు ఇతర లాంఛనాలు అత్తింటివారు ముట్టజెప్పారు. ఏడాది వరకు ఆ దంపతుల జీవనం సాఫీగా సాగింది. వారికి ఒక కొడుకు రేయాన్స్ అలియాస్ అర్విన్(11 నెలల 25 రోజులు)ఉన్నాడు. నరేష్ హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ వరంగల్ ఎల్లంబజారులో ఇంటి వద్దనే ఉంటూ వర్క్ ఫ్రం హోం చేస్తున్నాడు. అదనపు వరకట్నం విషయంలో ఇటీవల భార్యాభర్తలు శ్రీజ, నరేష్‌ల మధ్య తరచుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మార్చి 29న భర్త నరేష్, అత్త సుజాత, మామ కేశవాచారిలు కలిసి శ్రీజను కొట్టి, వరకట్నం తీసుకురావాలని కొడుకుతో సహా పుట్టింటికి పంపించారు. అయితే మంగళవారం ఉదయం 6 గంటలకు శ్రీజ తన భర్త నరేష్‌కు ఫోన్ చేసి ఈ నెల 5న కొడుకు రేయాన్స్ పుట్టినరోజు ఉందని, భర్తను రావాలని కోరగా తను రానని, మీరే చేసుకోండని ఆగ్రహం వ్యక్తం చేస్తూ భర్తతోపాటు అత్త, మామలు దూషిస్తూ నీవు చచ్చిపో అంటూ మాట్లాడారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీజ ఉదయం ఏడు గంటలకు తన ఏడాది వయసున్న కొడుకు రేయాన్స్‌కు విషగుళికలు మింగించి తాను కూడా మింగింది. వెంటనే గుర్తించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేస్తుండగానే ఇంటి వద్దనే రేయాన్స్ మృతి చెందాడు. శ్రీజ స్పృహ కోల్పోయి నోటి నుంచి నురుగలు వస్తుండగా ఆటోలో అపోలోరీచ్ ఆసుపత్రికి తరలించారు. కొద్దిసేపటికి ఆసుపత్రిలో చికిత్స చేస్తుండగా శ్రీజ మరణించింది. అక్కడే ఉన్న శ్రీజ తల్లి పూసాల జయప్రద(51) ఆధార్‌కార్డు తీసుకువస్తానని ఇంటికి వెళ్లి బెడ్‌పైన ఉన్న విషగుళికలు మింగింది. పక్కనే ఉన్న ఒక మహిళ వారించేసరికే ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఆమెను వెంటనే కుటుంబ సభ్యులు అపోలోరీచ్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం మరణించింది. పూసాల జయప్రద కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుండగా ఆమె భర్త వెంకటేశ్వరాచారి మానకొండూర్‌లో జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. మృతులు శ్రీజ తండ్రి, జయప్రద భర్త వెంకటేశ్వరచారి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శ్రీజ తన కొడుకును హత్య చేసినట్లు కేసు నమోదుకాగా శ్రీజను భర్త నరేష్, అత్త సుజాత, మామ కేశవాచారిలు వరకట్నం కోసం వేధించినట్లు, వారి వేధింపుల కారణంగానే శ్రీజ, ఆమె తల్లి జయప్రద ఆత్మహత్య చేసుకున్నట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ రూరల్ ఎస్‌ఐ వెంకట్రాజం తెలిపారు.

- విష ప్రభావం కలిగిన టాబ్‌లెట్స్ ఎక్కడి నుంచి వచ్చాయనేది అంతుబట్టకుండా ఉంది. ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి శ్రీజ తెప్పించుకుని ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. శ్రీజ ఆసుపత్రిలో మరణించగానే ఆధార్‌కార్డు కోసం అని మరో మహిళతో ఇంటికి వెళ్లిన జయప్రద ఇంటిలో బెడ్‌పైన ఉన్న ఆ విషగుళిక ఒక్కటి నోటిలో వేసుకోగా అక్కడే ఉన్న మహిళ ఆ గుళికను బలవంతంగా తీసేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. ఆ క్షణంలోనే జయప్రద స్పృహకోల్పోయిందని బంధువులు తెలిపారు. ఆత్మహత్యకు నిర్ణయించుకునే సెనేడ్ అంతటి విషం కలిగిన గుళికలను శ్రీజ తెప్పిచ్చుకుని ఉంటుందని భావిస్తున్నారు.
- మరో మూడు రోజుల్లో రేయాన్స్ పుట్టినరోజు ఉండగా అంతలోనే ఈ ఘటన జరుగడం ఆ కుటుంబంలో విషాదం నింపింది. ఈ ఘటనను తలుచుకుని బంధువులతో పాటు గ్రామస్తులు కంటనీరు పెట్టారు. కొన్ని గంటల ముందు ఇంటిలో కూతురు, భార్య, మనుమడితో గడిపిన తండ్రి ఆ ముగ్గురు మరణంతో ఒంటరివాడయ్యాడు.

జలపతి తండాలో వివాహిత ఆత్మహత్య



శోభ (ఫైల్)

చందుర్తి, ఏప్రిల్ 2: చందుర్తి మండలం దేవుడి తండా గ్రామపంచాయతీ పరిధిలోని జలపతి తండాలో గుగులోతు శోభ(25) అనే మహిళ అదనపు వరకట్నం వేధింపులు తాళలేక మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. చందుర్తి మండలం దేవుని తండా గ్రామ పంచాయతీ పరిధిలోని జలపతి తండాకు చెందిన గుగులోతు జలం ధర్‌కు వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి చెందిన శోభతో ఆరు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వివాహ సమయంలో కట్నకానుకలు ఇచ్చి పెళ్లి జరిపించారు. వివాహం జరిగిన కొద్దిరోజులు వీరి కాపురం సాఫీగానే సాగింది. వీరికి నాలుగు సంవత్సరాల క్రితం కుమారుడు జన్మించాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య అదనపు వరకట్న వేధింపుల గొడవలు జరుగుతున్నాయి. కాగా సోమవారం అర్ధరాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. వరకట్న వేధింపులతో శోభ చనిపోయిందని మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు తహసీల్దార్ శ్రీనివాస్ సమక్షంలో పంచనామా నిర్వహించి, డీఎస్పీ నాగేంద్రచారి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 2: జగిత్యాల అర్బన్ మండలం మోతె చెరువులో ఈతకు వెళ్లి విద్యార్థి మంగళవారం మృతి చెందాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల పట్టణంలోని నాగేంద్రనగర్ కాలనీకి చెందిన రొడ్డ ఉమ మహేష్ (14) జగిత్యాల పట్టణ శివారులోని మోతె చెరువులోకి తన స్నేహితులతో కలిసి ఈతకొట్టేందుకు వెళ్లాడు. ఈత కొడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

వీడనున్న విద్యార్థి మృతి మిస్టరీ

- వ్యవసాయ బావిలో మృతుడి తల లభ్యం
- పరీక్షల కోసం హైదరాబాద్‌కు పంపించిన పోలీసులు

తిమ్మాపూర్, ఏప్రిల్2: ఓ ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా మొదటి సంవత్సరం చదువుతున్న ఎనగంటి అభిలాష్ గత మార్చి 1న కళాశాల నుంచి బయటకు వెళ్లి 27 రోజుల తరువాత మార్చి 27న తిమ్మాపూర్ గ్రామంలోని ఓ వ్యవసాయ బావిలో కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం లభించింది. మృతదేహానికి తల లేకపోవడంతో విద్యార్థి అభిలాష్ ఆత్మహత్య చేసుకున్నడా? లేక ఎవరైనా హత్య చేశారా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. విద్యార్థి కుటుంబ సభ్యులు కూడా విద్యార్థి అభిలాష్ మృతిపై అనుమానాలు ఉన్నాయని ఎల్ఎండి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిమ్మాపూర్ సిఐ కర్రె స్వామి, ఎల్ఎండి ఎస్సై చేరాలు ఆరు రోజులుగా బావిలో ఉన్న నీటిని పెద్ద మోటర్లు, క్రేన్‌ల సహాయంతో, మనుషులను పెట్టి తీసేందుకు ప్రయత్నించగా మంగళవారం ఉదయం బావిలో తల భాగం(పుర్రె) లభించింది. సిఐ స్వామి, గన్నేరువరం ఎస్సై నరేష్ క్రేన్ సహాయంతో వ్యవసాయ బావిలోకి దిగి దానికి బయటకి తీయించారు. పుర్రెను హైదారాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించి డీఎన్ఏ పరీక్షతో పాటు గాయాలేమైనా ఉన్నాయా అనే కోణంలో విచారణ చేపట్టనున్నారు. రిపోర్టుతో కేసు కొలిక్కి వచ్చే అవకాశం ఉందని, నివేదిక వచ్చేందుకు సుమారు నెల రోజుల సమయం పట్టే అవకాశం ఉందని సీఐ స్వామి తెలిపారు. బావిలో నీటిని తోడేందుకు కృషి చేసిన వారిని అభినందించారు.

యువకుడి ఆత్మహత్య



అరుణ్(ఫైల్)

జ్యోతినగర్,ఏప్రిల్2: ఎన్టీపీసీ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో దూకి మంగళవారం ములుకుంట్ల అరుణ్(23) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎల్కలపల్లి గేట్ ప్రాంతానికి చెందిన అరుణ్ మృతదేహాన్ని ఎన్టీపీసీ పోలీసులు రిజర్వాయర్ నుంచి బయటకు తీసి పోస్టుమార్టం కోసం గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతికి గల కారణాలను దర్యాప్తు చేస్తున్నారు. ఎన్టీపీసీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 2 : మండలంలోని బొంపల్లి గ్రామానికి చెందిన దాడి శ్రీనివాస్(45) అనుమానాస్పదంగా మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బొంపల్లి గ్రామానికి చెందిన దాడి శ్రీనివాస్ రోజువారీగా గొర్ల కాపరిగా ఉంటూ సోమవారం ఇంటికి వచ్చాడు. రాత్రి సమయంలో ఇంటి ముందు పడుకోగా ఉదయం లేచి చూసేసరికి మంచం కిందపడి ఉన్నాడు. మృతుడి భార్య సుజాత గమనించి పెద్దపల్లి ఆసుపత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు తలకు తీవ్రగాయమైందని మృతిచెందినట్లు తెలిపినట్లు పేర్కొన్నారు. మృతుని భార్య దాడి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి



అఖిల్(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 2: మండలంలోని సింగాపూర్ గ్రామ శివా రులో మార్చి 30వ తేదీన హుజూరాబాద్ పట్టణానికి చెందిన ఇజ్జిగిరి అఖిల్ రోడ్డు ప్రమాదానికి గురికాగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అఖిల్ స్థానికంగా ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతుండగా తన మిత్రులను కలిసేందుకు సింగాపూర్ గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ప్రమాదం చోటు చేసుకుంది. చికిత్స కోసం హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కుక్కకాటుతో యువకుడి మృతి



అరుణ్ (ఫైల్)

కోనరావుపేట, ఏప్రిల్ 2: మండలంలోని ధర్మారంలో కుక్క కాటుకు మంకు అరుణ్ (28) అనే యువకుడు మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. ధర్మారం గ్రామానికి చెందిన మంకు వినోద, శంకర్ దంపతులు నిజామాబాద్ గ్రామంలో నివాసం ఉంటున్నారు. వీరి కుమారుడు అరుణ్ ధర్మారం గ్రామంలో ఉంటున్న నానమ్మ ఇంటి వద్ద ఉంటున్నాడు. రెండు నెలల క్రితం నిజామాబాద్ గ్రామంలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చిన క్రమంలో గ్రామంలో పలువురితో పాటు అరుణ్‌ను పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. కుక్క కాటుకు వైద్యం చేయించుకున్నప్పటికీ 15 రోజుల క్రితం అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స నిమిత్తం హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతి చెందాడు.

గంజాయి రవాణా చేస్తున్న తొమ్మిది మంది అరెస్ట్



మాట్లాడుతున్న ఏసీపీ రమేష్



పట్టుకున్న గంజాయితో పోలీసులు (ఫైల్)

● రెండు కిలోల గంజాయి స్వాధీనం

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 2: గంజాయి రవాణా చేస్తున్న రెండు ముఠాలను అరెస్ట్ చేసినట్టు గోదావరిఖని ఏసీపీ రమేష్ తెలిపారు. మంగళవారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఏసీపీ మాట్లాడారు. గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి న్యూమారేడుపాక చౌరస్తా వద్ద సోమవారం సాయంత్రం తనిఖీలు జరుపుతున్న సమయంలో ఇద్దరు యువకులు గంజాయి తరలిస్తూ పట్టుబడినట్టు ఏసీపీ పేర్కొన్నారు. వారివద్ద కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. పాలకుర్తి నుంచి గంజాయి తీసుకువచ్చి యైటింక్లయిన్‌కాలనీతో పాటు సమీప ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్టు తెలిపారు. కమాన్‌పూర్‌పోలీస్‌స్టేషన్ పరిధి జూలపల్లి శివారులో గంజాయి తరలిస్తున్న ఏడుగురిని కమాన్‌పూర్ పోలీసులు పట్టుకుని, వారి వద్ద కిలో గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. విలేకరుల సమావేశంలో సీఐ బీ రవీందర్, సీఐ-2 లింగమూర్తి, కమాన్‌పూర్ ఎస్సై చంద్రశేఖర్, టూటౌన్ ఎస్సైలు వెంకటేష్, సనత్‌కుమార్ పాల్గొన్నారు.

థాణాలో ఉంచిన గంజాయి మాయం

సారంగాపూర్ : పోలీసుల తనిఖీల్లో పట్టుకున్న గంజాయిని గుర్తు తెలియని వ్యక్తులు ఏకంగా థాణా నుంచి ఎత్తుకెళ్లిన ఘటన చర్చనీయాంశంగా మారింది. 2023 ఫిబ్రవరిలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా రాజస్థాన్‌కు చెందిన ఓ అంబులెన్స్‌లో 70 కిలోల గంజాయి లభ్యమైంది. పోలీసులు నలుగురు నిందితులను పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టుకున్న గంజాయిని అదే అంబులెన్స్‌లో భద్రపరిచి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై క్వార్టర్ పక్కన పార్కింగ్ చేశారు. సోమవారం ఉదయం పోలీసులు అంబులెన్స్‌ను పరిశీలించగా అంబులెన్స్ అద్దాలు పగులగొట్టి అందులోని గంజాయిని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, అదనపు ఏఎస్పీ వినోద్ కుమార్, డీఎస్పీ రఘు చందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏకంగా పోలీస్‌స్టేషన్ నుంచి గంజాయి మాయం కావడంతో ఎస్పీ తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలిసింది.

ఎక్సైజ్ అధికారుల మెరుపు దాడులు

10 లీటర్ల గుడుంబా, 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

కోనరావుపేట, ఏప్రిల్ 2: మండలంలోని పలు తండాల్లో కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించి ఐదు లీటర్ల గుడుంబా, ఎనిమిది వందల లీటర్ల బెల్లం పానకమును ధ్వంసం చేశారు. ఎక్సైజ్ సీఐ ఎం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి తండా, గోవిందరావుపేట తండాలో గుడుంబాను తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 10 లీటర్ల గుడుంబా, 800 లీటర్ల బెల్లం పానకమును స్వాధీనం చేసుకొని ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ అధికారులు సూపరింటెండెంట్ పంచాక్షరి, ఎక్సైజ్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

- పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 2: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగానికి నిధులు కేటాయించడమే కాకుండా పనులు సత్వరమే అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వడంతో పాటు బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని కోరారు. పదవీవిరమణ పొందిన ఉపాధ్యాయులకు బాండ్‌లు ఇవ్వాలనే ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పీఆర్టీయూ కృషిచేస్తుందని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, సంఘ నాయకులు శశిధర్‌శర్మ, తూముకుంట మోహన్‌రెడ్డి, మాన్వాడ శంకర్, సందీప్‌రెడ్డి, బాల్‌రెడ్డి, వనపర్తి వెంకటేష్ ఉన్నారు.

ప్రజా అభిప్రాయం మేరకే మేనిఫెస్టో

- బీజేపీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు ఎస్.కుమార్



రైతుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్న మేనిఫెస్టో కమిటీ సభ్యులు

భగత్‌నగర్, ఏప్రిల్ 2: ప్రజా అభిప్రాయం మేరకే భారతీయ జనతాపార్టీ మేనిఫెస్టో ఉంటుందని మేనిఫెస్టో కమిటీ సభ్యుడు, ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ అన్నారు. మంగళవారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించి త్వరలో బీజేపీ పక్షాన ప్రజా మేనిఫెస్టోను విడుదల చేస్తామన్నారు. ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలను సేకరించి విడుదల చేస్తామన్నారు. రైతులు ఏం కోరుకుంటున్నారో అభిప్రాయాలను చెప్పాలన్నారు. సమావేశంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జయశ్రీ, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు పాల్గొన్నారు.

వేములవాడలో ఒకరి దారుణ హత్య

- మద్యం మత్తులో స్నేహితుడే కడతేర్చినట్లు అనుమానం



సిర్రం మహేశ్(ఫైల్)

వేములవాడ, ఏప్రిల్ 2: మద్యం మత్తులో కిరాతకంగా బండరాయితో కొట్టి స్నేహితుడినే చంపిన సంఘటన వేములవాడ పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన సిర్రం మహేశ్ (46) రెండు సంవత్సరాలుగా వేములవాడలో కూలి పని చేస్తూ ఉపాధి పొందుతున్నాడు. స్థానిక భగవంతరావునగర్‌లో ఓ గది అద్దెకు తీసుకొని ఒంటరిగా ఉంటున్న మహేష్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మరో వ్యక్తితో పరిచయం ఏర్పడడంతో ఇద్దరు కలిసి తరచూ మద్యం సేవించేవారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇద్దరూ కలిసి మద్యం సేవించిన తర్వాత ఇరువురి మధ్య మాటామాటా పెరగడంతో తోటి స్నేహితుడు రాయితో ముఖంపై బాదడంతో మహేష్ అక్కడికక్కడే చనిపోయాడు. సోమవారం ఉదయం ఇంటి అద్దె వసూలు కోసం వచ్చిన యజమాని శ్రీనివాస్ ఎంత పిలిచినా స్పందన లేకపోవడంతో తలుపు నెట్టగా తలుపు తెరుచుకుంది. ఇంట్లో మంచంపై ఎలాంటి చలనం లేకుండా పడి ఉన్న మహేష్‌ను చూసి తమకు సమాచారం అందించాడని పోలీసులు తెలిపారు. హత్య ఘటన సమాచారం తెలుసుకున్న వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, పట్టణ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మద్యం సేవించిన అనంతరం మహేష్‌పై రాయితో దాడికి పాల్పడి హత్యకు కారణమైన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనపై మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్ తెలిపారు.

కొండాపూర్‌లో విషాదం

ముస్తాబాద్: వేములవాడలో సోమవారం రాత్రి జరిగిన ఘటనలో కొండాపూర్ గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. తాగిన మత్తులో జరిగిన దాడిలో కొండాపూర్‌కు చెందిన సిర్రం మహేశ్ మృతి చెందాడని స్థానికులు తెలిపారు. కొంత కాలంగా వేములవాడలో కూలి పనిచేసుకుంటున్న మహేశ్ స్నేహితులతో జరిగిన గొడవలో మరణించాడని పేర్కొన్నారు. కనీసం ఇల్లు కూడా లేని సిర్రం మహేశ్ మృతదేహాన్ని పోస్టుమార్టమ్ అనంతరం నేరుగా ఊళ్లో దహన సంస్కారాలకు తీసుకువెళ్లడం పలువురిని కలిచి వేసింది. మహేశ్‌కు భార్య సిర్రం పద్మ, ఇద్దరు పిల్లలున్నారు.

రేషన్ అక్రమాలకు పాల్పడితే చర్యలు

ఓదెల, ఏప్రిల్ 2 : రేషన్ బియ్యం అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రేమ్‌కుమార్ మండలంలోని రేషన్ దుకాణాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. రేషన్ షాప్ నం. 20లో 4.50 క్వింటాళ్ల బియ్యం నిల్వలు తేడా ఉన్నట్లు గుర్తించి, కేసు నమోదు చేసి కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. తనిఖీలలో సంబంధిత అధికారులు, సిబ్బంది ఉన్నారు.

గోమాతల రక్షణకు చర్యలు తీసుకోవాలి

మంథని, ఏప్రిల్ 2: రంజాన్ పండగ సందర్భంగా గోమాతలను మంథని చుట్టూ పరిసర ప్రాంతాల్లో అక్రమ తరలింపు, గోహత్యలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున గోమాతల రక్షణ కొరకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మంత్రపురి గౌతమేశ్వర గోశాల చైర్మన్ స్రవంతి విద్యాసాగర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం వినతిపత్రం సమర్పించారు. గోమాతల రక్షణకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేయ్యాలని, గోహత్యలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట ఎస్వీఆర్ వెంకటేష్‌లు ఉన్నారు.

ఘనంగా బీరయ్య ఉత్సవాలు

ఎలిగేడు, ఏప్రిల్ 2 : మండలంలోని ముప్పిరితోటలో మంగళవారం బీరయ్యకామారతి ఉత్సవాలను గొల్ల, కురుమలు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఐదేళ్లకోసారి జరిగే ఉత్సవాల్లో గొల్లకురుమలు ఆనవాయితీగా వస్తున్న బీరయ్య కామరాతి పట్నాలు నిర్వహించి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. రైతులు వేసిన పంటలు, పాడిపశువులు సమృద్ధిగా పెంపొందాలని గొల్లకురమలు ఎదుగుదలకు వీరయ్య కామరాజు తోడ్పడాలని వారు ఒగ్గు కథలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముప్పిరితోట, మల్లయ్యపల్లెకు చెందిన గొల్ల కురుమలు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వికలాంగుల కేంద్రంలో పండ్ల పంపిణీ

కమాన్‌పూర్, ఏప్రిల్ 2 : మండల కేంద్రంలో ఎల్లమ్మ బోనాల సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని స్ఫూర్తి మానసిక వికలాంగుల కేంద్రంలో భోజనం, పండ్ల పంపిణీ మంగళవారం చేపట్టారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ మహిళా అధ్యక్షురాలు నారగోని సరిత, ఆసం శ్రీకాంత్, మెడగొని విజయ్, మల్యాల విజయ్, గీసగొని శ్రీనివాస్, చెన్నూరి అభిలాష్, ఇనగంటి రోహిత్ రావు తదితరులు ఉన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

సుల్తానాబాద్, ఏప్రిల్ 2: ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి అన్నారు. ఒకినోవా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సెయింట్ మేరీస్‌స్కూల్‌లో కొన్ని రోజులుగా శిక్షణ పొందుతున్న విద్యార్థులకు మంగళవారం కరాటే గ్రేడింగ్ టెస్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. గ్రేడింగ్‌లో పాస్ అయినవారికి సిఐతో పాటు ఎస్ఐ శ్రావణ్ కుమార్, ఒకినోవా మార్షల్‌ఆర్ట్స్ చీఫ్ ఎగ్జామినర్ వసంత్ కుమార్, కరాటే మాస్టర్ బుర్ర ప్రవీణ్, ప్రిన్సిపాల్ ఫాదర్ తుమ్మజోసెఫ్ అశోక్ బెల్టులను అందజేశారు.

ఆర్థిక సహాయం

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 2: మూడునెలల క్రితం బైక్‌పై వెళుతుండగా ప్రమాదవశాత్తు గాయపడి ఆసుపత్రిపాలైన ఫొటోగ్రాఫర్ ఎండీ షర్ఫుద్దీన్‌కు రూ.10వేల చెక్కును మంగళవారం లక్ష్మీనగర్‌లో జిల్లా ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి భాస్కర్ అందజేశారు. అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పీడబ్ల్యూడీ, వృద్ధులు ఇంటివద్దనే ఓటుహక్కు వినియోగించుకోవచ్చు

- అదనపు కలెక్టర్ అరుణశ్రీ

కోల్‌సిటీ, ఏప్రిల్ 2: రామగుండం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పీడబ్ల్యూడీ ఓటర్లు 2682 మంది, 85 సంవత్సరాల వయసు పైబడిన ఓటర్లు 570మంది మొత్తం 3252 మందిని గుర్తించినట్టు అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ తెలిపారు. వీరంతా లోక్‌సభ ఎన్నికల్లో ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకోవచ్చునని తెలిపారు. ఫారం-12డీ దరఖాస్తులను బీఎల్‌వో, బీఎల్‌వో సూపర్‌వైజర్ల ద్వారా ఓటర్ ఇంటికి నేరుగా పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని గుర్తించబడిన పీడబ్ల్యూడీ ఓటర్లు, 85 సంవత్సరాల వయసు పైబడిన ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ కోరారు.

మొక్కుబడిగా పెద్దపల్లి మండల పరిషత్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బండారి స్రవంతి

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 2 : మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ బండారి స్రవంతి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నామ మాత్రంగా జరిగింది. మండలంలోని గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. గతంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశాల్లో సభ్యులు మొరపెట్టుకున్నా పరిష్కారా నికి నోచుకోలే దు. వైస్‌ఎంపీపీ ముత్యాల రాజయ్య, అందుగులపల్లి ఎంపీటీసీ పందిళ్ల లక్ష్మణ్‌లు మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్యల లేకుండా మిషన్ భగీరథ క్రమం తప్పకుండా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. చివరి దశలో ఉన్న వరిపంటలు ఎండిపోకుండా మరో రెండు విడతలు ఎస్సారెస్పీ సాగునీ టిని విడుదల చేయాలని కోరారు. సభ్యులు మాట్లాడుతూ వ్యవసాయానికి త్రీఫేస్ విద్యుత్ కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశానికి ఆయా శాఖల అధికారులు హాజరు కాకపోవడంతో సమస్యలు కూడా చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఈ సమావేశంలో ఎంపీడీవో గున్నాల శ్రీనివాస్‌గౌడ్, సింగిల్ విండో చైర్మన్ చింతపండు సంపత్‌తోపాటు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సాగునీరందక ఎండిపోతున్న పంటలను కాపాడాలి

- సుల్తానాబాద్ మండల సమావేశంలో సభ్యుల డిమాండ్

సుల్తానాబాద్, ఏప్రిల్ 2: సాగునీరందక పంటలు ఎండిపోతున్నాయని, అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని పంటలను కాపాడి రైతులను ఆదుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. సుల్తానాబాద్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ బాలాజీరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో నారాయణపూర్, మియాపూర్ ఎంపీటీసీలు ఫకీర్ యాదవ్, మండల రమేష్ తదితరులు మాట్లాడుతూ కాలువనీరు అందడం లేదని, తమకు ఇవ్వకుండా చివరిప్రాంతాలకు తరలిస్తున్నారని దాంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు,ఎమ్మెల్యే జోక్యం చేసుకుని ఈనెలాఖరు వరకు కాలువల ద్వారా సాగునీరందించే ఏర్పాట్లు చేయాలని కోరారు. సుల్తానాబాద్‌లో పేరుకే పెద్దాసుపత్రి ఉందని, రోగులకు సరైన సేవలు అందించడంలేదని, సిబ్బంది డాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఎంపీటీసీలు ఆరోపించారు. తమ సమీప బంధువుతో కలిసి తాను ఆసుపత్రికి వెళితే కనీసం చూసే నాథుడే లేడని, సిబ్బంది కాలక్షేపం చేస్తున్నారని గట్టెపల్లి ఎంపీటీసీ శీలం శంకర్ అన్నారు. అనేక గ్రామాలలో తాగునీటి సమస్య ఎదురైందని మిషన్ భగీరథ పథకం ప్రజల అవసరాలను తీర్చడం లేదని తాత్కాలిక ఏర్పాట్లు చేసి తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని పలువురు కోరారు. వ్యవసాయ శాఖ కార్యక్రమాలు సభ్యులకు తెలుపడంలేదని ఇటీవల కాట్నపల్లిలో నిర్వహించిన వీసీకి తమకు సమాచారం లేదని సభ్యులు అన్నారు. రెబ్బల్దేవ్‌పల్లిలోని ఆయిల్ పామ్ నర్సరీలో జరిగే కార్యక్రమాలపై కూడా సమాచారం ఇవ్వాలని ఆయాగ్రామాల రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బాలాజీరావు

ఎంపీపీ, ఎంపీడీవోల ఆగ్రహం..

చెరువులు, కుంటల్లో మట్టితీయవద్దని సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారి ఎంపీడీవోకు లెటర్ పెట్టడంతో సభలో తీవ్ర దుమారం రేగింది. ఓవైపు ఈ వేసవిలో ఉపాధిహామీ కూలీలకు సరిపడా పనులు కల్పించాలని కలెక్టర్ ఆదేశిస్తుంటే, చెరువుల్లో పనులు చేయవద్దని ఏఈ లెటర్ జారీ చేయడం ఏంటని ఎంపీపీ, ఎంపీడీవోలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పైఅధికారుల సూచన మేరకే లెటర్ పెట్టానని ఏఈ వివరణ ఇచ్చినా అంగీకరించలేదు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. కాగా, ఆయా గ్రామాలకు నియమితులైన స్పెషల్ ఆఫీసర్లను ఉద్దేశించి ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు మాట్లాడుతూ ఇష్టం ఉంటే పని చేయండి లేకుంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి విధులనుంచి తప్పుకోండి లేదా ఇతరులకు అప్పగించాలన్నారు. తమకు కేటాయించిన గ్రామాలకు వారంలో రెండుమూడు రోజులైనా వెళ్లాలని, సమస్య ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. సమావేశంలో జడ్పీటీసీ మినుపాల స్వరూపప్రకాష్‌రావు, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీలు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సర్వాయి పాపన్న వర్ధంతి

సుల్తానాబాద్, ఏప్రిల్ 2: మండలంలోని నారాయణరావుపల్లి రేణుక ఎల్లమ్మ గుడి ఆవరణలో మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గొల్లపల్లి గీత కార్మిక సహకారం సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివా ళులు అర్పించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీ టీసీ మొలుగూరి అంజయ్య, సంఘం నేతలు శ్రీనివాస్, ఎల్లయ్య, రాములు, సత్తయ్య, రమేష్, మల్లేశం, అంజయ్య, సంపత్ సాయిదీప్ తదితరులు పాల్గొన్నారు.


నారాయణరావుపల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు

ఓదెల : మండలంలోని కొమిరలో మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్వాయి వర్ధంతిని నిర్వహించారు. పలువురు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్వాయి పాపన్న గౌడ సంఘం నాయకులు నల్లగోని వీరయ్యగౌడ్, నల్లగోని అనిల్, పబ్బ రాజయ్య, కమ్మగోని రాములు, సంపత్, రవి తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

సుల్తానాబాద్, ఏప్రిల్ 2: ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తన మెనిఫెస్టోలో పేర్కొన్న విధంగా మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేల చొప్పున చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు అన్నారు. ఈమేరకు నూతన కార్మిక పాలసీని రాష్ట్రంలో ప్రవేశపెట్టాలని కోరుతూ రాష్ట్ర కమిటీ వారు సీఎం రేవంత్‌రెడ్డికి ఇచ్చే లేఖ ప్రతులను వారు మంగవారం ఆవిష్కరించారు. సుల్తానాబాద్ మున్సిపల్ ఆఫీసు ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఇరవై ఆరు వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఐదేండ్ల సర్వీసు పూర్తిచేసిన కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, నూతన పారిశ్రామిక పాలసీని ప్రకటిచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ మున్సిపల్ శాఖ అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, నాయకులు మహంకాళి మల్లేష్, ఆరేపల్లి సురేష్, లక్ష్మి, లలిత, పద్మ, చిలుమల రామ్మూర్తి, పోచయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

రామగుండం మెడికల్ కళాశాలలో 74 పోస్టుల భర్తీకి చర్యలు : ప్రిన్సిపాల్

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 2: సింగరేణి మెడికల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో 74 కాంట్రాక్టు ప్రాతిపదికన పోస్టులను భర్తీ చేయనున్నట్టు ప్రిన్సిపాల్ హిమబిందు ఒక ప్రకటనలో తెలిపారు. అనాటమీ అసోసియేట్ ప్రొఫెసర్ 1, అసిస్టెంట్ ప్రొఫెసర్ 2, సీనియర్ రెసిడెంట్ ట్యూటర్ 4, ఫిజియోలాజీ అసోసియేట్ ప్రొఫెసర్ 1, అసిస్టెంట్ ప్రొఫెసర్ 3, సీనియర్ రెసిడెంట్ ట్యూటర్ 1, బయో కెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ 1, అసిస్టెంట్ ప్రొఫెసర్ 1, సీనియర్ రెసిడెంట్ ట్యూటర్ 2, ఫార్మాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ 2, అసిస్టెంట్ ప్రొఫెసర్ 2, సీనియర్ రెసిడెంట్ ట్యూటర్ 3, పాథాలజీ ప్రొఫెసర్ 1, అసోసియేట్ ప్రొఫెసర్ 3, సీనియర్ రెసిడెంట్ ట్యూటర్ 3, మైక్రో బయాలజీ ప్రొఫెసర్ 1, అసోసియేట్ ప్రొఫెసర్ 1, అసిస్టెంట్ ప్రొఫెసర్ 1, సీనియర్ రెసిడెంట్ ట్యూటర్ 3, ఫోరెన్స్ మెడిసిన్ ప్రొఫెసర్ 1, అసోసియేట్ ప్రొఫెసర్ 1, సీనియర్ రెసిడెంట్ ట్యూటర్ 3, కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్ 1, అసోసియేట్ ప్రొఫెసర్ 2, అసిస్టెంట్ ప్రొఫెసర్ 4, సీనియర్ రెసిడెంట్ ట్యూటర్ 5, జనరల్ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ 2, సీనియర్ రెసిడెంట్ ట్యూటర్ 1, డెర్మటాలజిస్ట్, వెనెరోలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ 1, ఫిజియోథెరపీ అసిస్టెంట్ ప్రొఫెసర్ 1, సీనియర్ రెసిడెంట్ ట్యూటర్ 1, రెస్పిరేటోరి మెడిసన్ అసోసియేట్ ప్రొఫెసర్ 1, సీనియర్ రెసిడెంట్ ట్యూటర్ 1, జనరల్ సర్జన్ అసోసియేట్ ప్రొఫెసర్ 1, ఈఎన్‌టీ అసిస్టెంట్ ప్రొఫెసర్ 1, సీనియర్ రెసిడెంట్ ట్యూటర్ 1, ఒబెసిటీ గైనకాలజిస్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ 1, రేడియోలజీ ప్రొఫెసర్ 1, అసిస్టెంట్ ప్రొఫెసర్ 1, సీనియర్ రెసిడెంట్ ట్యూటర్ 1, అనస్తిషియా అసోసియేట్ ప్రొఫెసర్ 2, ఎమర్జెన్సీ మెడిసిన్ ప్రొఫెసర్ 1, అసోసియేట్ ప్రొఫెసర్ 1, సీనియర్ రెసిడెంట్ ట్యూటర్ 2కు బుధవారం నుంచి ఈనెల 7వరకు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మెడికల్ కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఆమె ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాల జాతర


బోనాలతో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

రామగిరి, ఏప్రిల్ 2: రామగిరి మండలం కల్వచర్లలో గౌడ కుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా ఎల్లమ్మ బోనాల జాతరను చేపట్టారు. గ్రామంలోని గీత కార్మికుల కుటుంబాల నుంచి పెద్దసంఖ్యలో మహిళలు ఎల్లమ్మకు బోనాలతో ఉరేగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామ పురవీధుల గుండా మేళతాళాల మధ్య ఎల్లమ్మ ఆలయం వరకు చేరుకొని అమ్మవారికి వండిన బోనంను నైవేద్యంగా సమర్పించారు. గౌడ సంఘం అధ్యక్షుడు కాట రాజేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కులసంఘం పెద్దలు, మహిళలు, యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పోచమ్మ బోనాలు

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 2: మండలంలోని మొట్లపల్లి గ్రామంలో మంగళవారం పోచమ్మ బోనాలను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్లతో మహిళలు నెత్తిన బోనాలతో, శివసత్తుల పూనకాలతో ఊరేగింపుగా వెళ్లి పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. కల్లు, గుడాలు, బెల్లం పానకం, పసుపు కుంకుమలు, గాజులు, చీరజాకెట్టు, ఒడి బియ్యం పోశారు. సకల సౌభాగ్యాలు, ఆయురారోగ్యాలు, అష్ట ఐశ్వార్యాలు ప్రసాదించాలని, పిల్లా పాపలు, పాడి పంటలతో చల్లంగా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు.

కృష్ణవేణి వికాస్ చైర్మన్ 'నాగండ్ల'కు పురస్కారం


పురస్కారం అందుకుంటున్న రవికుమార్

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 2: గోదావరిఖనిలోని కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాల చైర్మన్ నాగండ్ల రవికుమార్‌కు పురస్కారం దక్కింది. ఈనెల 1న శిఖర ఆర్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో బంగారు నంది అవార్డు పురస్కారాన్ని రవికుమార్‌కు దైవజ్ఞశర్మ చేతుల మీదుగా అందజేశారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించడంతో పాటు తక్కువ ఫీజులతో విద్యా సేవలు అందిస్తున్న సేవకుడని ప్రశంసిస్తూ రవికుమార్‌కు ఈ పురస్కారాన్ని అందజేశారు. కాగా ఈ ప్రాంతానికి చెందిన కళాశాల చైర్మన్ రవికుమార్ అరుదైన పురస్కారం అందుకోవడం పట్ల పలువురు విద్యావంతులు అభినందనలు తెలిపారు. శిఖర ఆర్ట్ డైరెక్టర్ ఉప్పులేటి నరేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉమామహేశ్వరరావు, జేకే భారవి, భవానీ రెడ్డి, కిరణ్‌కుమార్, సుజాత, చక్రపాణి పాల్గొన్నారు.

మాల మహానాడు పోస్టర్ ఆవిష్కరణ

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 2: మండల కేంద్రంలో జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో చేపట్టిన రాజ్యాంగ రక్షణయాత్ర కరపత్రాలను మంగళవారం జాతీయ మాల మహానాడు జిల్లా కన్వీనర్ మాదాసి సతీష్, నాయకులు కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మారుస్తామని కేంద్ర ప్రభుత్వం చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఏప్రిల్ 2 నుంచి 8 వరకు రాజ్యాంగ రక్షణ యాత్ర నిర్వహిస్తున్నారన్నారు. జిల్లా కేంద్రానికి ఈనెల 5న యాత్ర చేరుకుంటుందని, మాల మహానాడు సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని రాజ్యాంగ రక్షణ యాత్ర విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు మండలాధ్యక్షుడు కాసర్ల సాంబశివరావు, గీస రాజు, చిదురు నరేందర్, చెవుల రాయమల్లు, మాదాసి చందు, బండెల శ్రీను, మొగిలి రాజయ్య మాల మహానాడు సభ్యులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి

-ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న న్యాయవాదులు

ఎలిగేడు, ఏప్రిల్ 2: న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఎలిగేడు మండలం శివపల్లి గ్రామంలో మంగళవారం సుల్తానాబాద్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు పడాల శ్రీరాములు ఆధ్వర్యంలో న్యాయవాదులు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం కోర్టుకు సంబంధించిన పలు సమస్యలను వారి దృష్టికి తెచ్చారు. స్పందించిన విజయరమణారావు పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం యువ న్యాయవాది శివకృష్ణ కాంగ్రెస్ కండువా కప్పుకొని పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, దన్నయక్ దామోదర్‌రావు, గొడెల శ్రీనివాస్‌రెడ్డి, మినుపాల ప్రకాష్‌రావు, అంతటి అన్నయ్యగౌడ్, ఒడ్నాల రవీందర్, ఆకారపు సరోత్తంరెడ్డి, దూడం ఆంజనేయులు, వడ్లకొండ రవికిరణ్, మల్యాల కర్ణకర్, ఆవుల శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర చిత్రార్చనలో సుల్తానాబాద్ కళాకారుడికి అవకాశం


బ్రహ్మానందం చేతుల మీదుగా పుస్తకం అందుకుంటున్న చిత్రకారుదు వెంకన్న

సుల్తానాబాద్, ఏప్రిల్ 2: శ్రీ కళాక్షేత్ర తిరుమల తిరుపతి వారు శ్రీవెంకటేశ్వర స్వామి వారి వివిధ రూపాల పెయింటింగ్‌లు పుస్తక రూపంలో తీసుకువచ్చారు. శ్రీవెంకటేశ్వర చిత్రార్చన పేరుతో దేశంలోని ఎంతోమంది చిత్రకారుల చిత్రాలను ఈ పుస్తకంలో ప్రచురించారు. తిరుమలలో టీటీడీ శిల్ప కళాశాలలో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. సుల్తానాబాద్ పట్టణానికి చెందిన కందునూరి వెంకన్న పటేల్ గీసిన శ్రీవేంకటేశ్వర స్వామి చిత్రాన్ని పుస్తకంలో ప్రచురించారు. ఆ పుస్తకాన్ని డాక్టర్ బ్రహ్మానందం చేతుల మీదుగా వెంకన్న అందుకున్నారు. వెంకన్న పటేల్ ఉద్యోగరీత్యా మహారాష్ట్రలోని చంద్రాపూర్‌లో పని చేస్తున్నారు.



సీహెచ్‌పీ కార్మికులకు ప్రోత్సాహక బహుమతులివ్వాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 2: ఓసీపీ-3 సీహెచ్‌పీ కార్మికులకు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వాలని కోరుతూ మంగళవారం ఐఎన్‌టీయూసీ ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ సత్యనారాయణరెడ్డి ప్రాజెక్టు మేనేజర్ రమేష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ప్రాజెక్టుకు నిర్దేశించిన వార్షిక లక్ష్యం అధిగమించి కార్మికులు తమ చిత్తశుద్ధిని చాటారని, సీహెచ్‌పీ ద్వారా అత్యధిక బొగ్గు రవాణా జరగడంలో సెక్షన్ కార్మికుల శ్రమ ఉన్నదని సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. సకాలంలో నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేసేలా కృషి చేసిన సీహెచ్‌పీ కార్మికులకు ప్రోత్సహకాంగా వెండి నాణెంను బహుమతి రూపంలో ఇవ్వాలని, స్వీట్ బాక్స్ ఇవ్వాలని కోరారు.

బేస్‌వర్క్‌షాప్ క్యాంటీన్‌లో మ్యాన్‌పవర్ పెంచాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 2: బేస్‌వర్క్‌షాప్‌లోని మెయింటనెన్స్ సెక్షన్ క్యాంటీన్‌లో మ్యాన్‌పవర్ పెంచాలని ఐఎన్‌టీయూసీ నాయకులు సత్యనారాయణరెడ్డి, ఎట్టెం కృష్ణ, సంపత్‌రెడ్డి, అక్రంలు ప్రకటనలో పేర్కొన్నారు. కృషి భవన్‌కు తరలించిన తర్వాత రెండు క్యాంటీన్లను ఏర్పాటుచేసినప్పటికీ మెయింటనెన్స్ సెక్షన్‌లో మ్యాన్‌పవర్ లేక కార్మికులకు క్యాంటీన్ సదుపాయం అందడం లేదని తెలిపారు. మరో క్యాంటీన్‌కు వెళ్లాలంటే భారీ యంత్రాలు నడిచే దారి దాటి వెళ్లాల్సి వస్తున్నదని, సమయం వృథాఅవుతున్నట్టు పేరొన్నారు. డోజర్, మెయింటనెన్స్ ఆటో ఎలక్ట్రికల్ సెక్షన్ కార్మికులకు ఉపయోగపడేలా క్యాంటీన్‌లో మ్యాన్‌పవర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 2: ఫిల్టర్‌బెడ్ మరమ్మతుల కారణంగా బుధవారం నీటి సరఫరా నిలిపివేయనున్నట్టు ఆర్జీ-2 అధికార ప్రతినిధి రాజేంద్రప్రసాద్ ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగులకు స్వచ్ఛమైన నీటిని సరఫరా చేసేందుకు ఫిల్టర్ బెడ్‌లోని చాంబర్స్ శుభ్రం చేసే పనులు జరుగుతున్నందున నీటిసరఫరా నిలిపివేయనున్నట్టు డీజీఎం తెలిపారు. కాలనీ, పోతనకాలనీ ఉద్యోగుల కుటుంబాలు పొదుపుగా నీటిని వాడుకోవాలని తెలిపారు.

టీబీజీకేఎస్ సభ్యత్వ నమోదు ప్రారంభం

గోదావరిఖని, ఏప్రిల్ 2: సింగరేణి కార్మికుల కోసం అలుపెరుగని పోరాటం చేసి అనేక హక్కులు సాధించిన టీబీజీకేఎస్‌లో పెద్ద ఎత్తున సభ్యులుగా నమోదు కావాలని యూనియన్ స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిరియాల రాజిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సింగరేణి కార్మికులను భాగస్వామ్యం చేయటంలో కీలకపాత్ర పోషించామని తెలిపారు. పిడికెడు మందితో ప్రారంభమై అంచలంచెలుగా ఎదిగి సింగరేణి గుర్తింపు కార్మిక సంఘంగా నిలిచిన ఘన చరిత్ర కలిగిన టీబీజీకేఎస్‌దని వివరించారు. కార్మిక హక్కుల సాధన కోసం పోలీసు కేసులను, జైలు జీవితాన్ని అనుభవించిన బలమైన నాయకులు కలిగిన యూనియన్‌ను ఆదరించాలని ఆయన కోరారు. సింగరేణి పరిశ్రమ విస్తరణకు, నూతన ఉద్యోగాల కల్పనకు, సింగరేణి ఆధ్వర్యంలో కొత్త బొగ్గు గనుల తవ్వకానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై జరిపే పోరాటంలో కార్మికులు భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నూనె కొమురయ్య, మాదాసి రామమూర్తి, పర్లపల్లి రవీందర్, ఎల్ వెంకటేష్, జహీద్ పాషా, చెల్పూరి సతీష్, పోలాడి శ్రీనివాసరావు, కోండ్ర అంజయ్య, చల్ల రవీందర్ రెడ్డి, కొయ్యడ రమేష్, మహమ్మద్ ఘని, జనగామ మల్లేష్, మహేందర్, తిరుపతి, భాస్కర్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.


టీబీజీకేఎస్ సభ్యత్వం అందజేస్తున్న మిర్యాల రాజిరెడ్డి

సమష్టి కృషితోనే ఉత్తమ లక్ష్యాలు సాధించాం

- ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు


ప్రోత్సాహక బహుమతులను అందిస్తున్న జీఎం

రామగిరి, ఏప్రిల్ 2: సమష్టి కృషితోనే ఉత్తమ లక్ష్యాలు సాధించగలిగామని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. మంగళవారం డివిజన్‌లోని ఓసీపీ-2లో 2023-24 ఆర్థిక సంవత్సరానికి నిర్ధేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకున్న సందర్భంగా ఏర్పాటుచేసిన అభినందన సభకు ముఖ్య అతిథిగా జీఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్మికులకు అభినందనలు తెలుపుతూ ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి రాజేందర్, అధికారులు శ్రీనివాస్, నాగరాజు, రామారావు, మనోహర్, వెంకటస్వామి, నాయకులు ఎంఆర్‌సీ రెడ్డి, కొట రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓసీపీ-2 విస్తరణ పనులకు రంగం సిద్ధం

- 88.20 ఎకరాల భూసేకరణ ఇటీవల ప్రాథమిక నోటిఫికేషన్

రామగిరి, ఏప్రిల్ 2: సింగరేణి ఆర్జీ-3 డివిజన్ పరిధి ఓసీపీ-2 విస్తరణ పనులు కొన్ని గ్రామాలకు శాపంగా మారాయి. మండలంలోని బుధవారంపేట్, రాజాపూర్ గ్రామస్తులు సింగరేణి భూసేకరణతో నిండా మునిగారు. ప్రాజెక్టు విస్తరణ కోసం సింగరేణి యాజమాన్యం రెండు గ్రామాల శివారులోగల రైతులకు చెందిన 708.16 ఎకరాలను సింగరేణి సంస్థ 2015లో అవార్డు ద్వారా స్వాధీనం చేసుకుంది. కొన్ని సంవత్సరాలుగా రెవెన్యూ రికార్డు ప్రకారం ధరణిలో సింగరేణి కంపెనినే పట్టాదారుడిగా కనిపిస్తోంది. నిర్వాసిత రైతులకు నష్టపరిహారం కల్పించకపోగా భూములు సింగరేణి స్వాధీనంలోనే ఉన్నాయి. తమ భూమి తమకు ఇప్పించలంటూ గ్రామస్తులు హైకోర్టును ఆశ్రయించగా 2023లో సింగరేణి అవార్డు రద్దు చేస్తూ భూములను రైతులకు అప్పగించాల్సిందిగా కోర్టు డైరెక్షన్ చేసింది. హైకోర్టు ఆదేశాల మేరకు గ్రామస్తులు దరఖాస్తులు చేసుకొని నెలలు గడుస్తున్నా రైతులకు పట్టాదారులకు పాస్‌బుక్కులు అందించలేదు. పైగా సింగరేణి మరో కొత్త రాగం అందుకుంది. ప్రాజెక్టు విస్తరణకు 88.20 ఏకరాలు చాలంటూ భూసేకరణకు రంగం సిద్ధం చేసుకుంటోంది. అందుకు గ్రామస్తులు అంగీకరించరని భావించి సింగరేణి యాక్టులను వాడుకుంటోంది. బుధవారంపేట్ గ్రామానికి చెందిన భూసేకరణ కోసం ఇటీవలే ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేయడం గమనార్హం.


బుధవారంపేట్ గ్రామం